# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 08-05-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ దేశీయ విమానయాన మార్కెట్ వేగంగా విస్తరిస్తోందని పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు.
- ❖ ప్రపంచంలోనే అత్యంత వేగంగా విస్తరిస్తున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారత్ ఉందని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ పేర్కొన్నారు.
- ❖ పశ్చిమ బెంగాల్ భారతీయ జనతా పార్టీ శాసనసభాపక్ష నేతగా సువేందు అధికారి ఎన్నికయ్యారు.
- ❖ ఆకాశవాణి 90వ వార్షికోత్సవం సందర్భంగా మారథాన్‌ను న్యూఢిల్లీలో ఈరోజు నిర్వహించారు.
- ❖ ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా కోల్‌కతా నైట్ రైడర్స్, ఢిల్లీ క్యాపిటల్స్ జట్ల మధ్య ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది.

=========================

దేశీయ విమాన ప్రయాణీకుల రద్దీ ఈ ఏడాదిలో 191 మిలియన్లకు చేరుకోవడంతో భారతదేశం ప్రపంచంలోనే మూడవ అతి పెద్ద దేశీయ విమానయాన మార్కెట్‌గా ఆవిర్భవించిందని పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చెప్పారు. గాంధీనగర్‌లోని గిఫ్ట్ సిటీలో ఈరోజు జరిగిన “ఇండియా ఎయిర్‌క్రాఫ్ట్ లీజింగ్ అండ్ ఫైనాన్సింగ్ సమ్మిట్ 2.0”లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న విమానయాన మార్కెట్‌గా భారతదేశం ఉందని చెప్పారు. విమానాల లీజింగ్, ఫైనాన్సింగ్ కు సంబంధించి ప్రపంచ గమ్యస్థానంగా రూపాంతరం చెందుతోందని గుర్తు చేశారు. ప్రస్తుతం దేశంలో ఉన్న 1,100 వాణిజ్య విమానాల సముదాయం 2035 నాటికి మూడు రెట్లు పెరుగుతుందని రామ్మోహన్ నాయుడు పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆకాశవాణి సంస్థ దేశానికి గడచిన 90 ఏళ్లుగా సేవలను అందిస్తున్న సందర్భాన్ని పురస్కరించుకుని మారథాన్‌ను న్యూఢిల్లీలో ఈరోజు నిర్వహించింది. ప్రసార భారతి సీఈఓ గౌరవ్ ద్వివేది, ఆకాశవాణి డైరెక్టర్ జనరల్ రాజీవ్ కుమార్ జైన్ ఈ పరుగును ప్రారంభించారు. దాదాపు 3.5 కిలోమీటర్ల వరకూ సాగిన ఈ మారథాన్ లో ఆకాశవాణి, దూరదర్శన్, ప్రసార భారతి ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసార భారతి సీఈఓ గౌరవ్ ద్వివేది మాట్లాడుతూ... మారథాన్ ద్వారా  ఫిట్‌నెస్ ఉద్యమ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్తున్నట్లు పేర్కొన్నారు. ఆకాశవాణి డైరెక్టర్ జనరల్ రాజీవ్ కుమార్ జైన్ మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా ఉన్న 232 ఆకాశవాణి కేంద్రాలలో ఈ నెలలో అనేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా 1936లో స్థాపించబడిన ఆకాశవాణి దేశంలో అత్యంత విశ్వసనీయమైన ప్రసార వేదికలలో ఒకటిగా కొనసాగుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచంలోనే అత్యంత వేగంగా విస్తరిస్తున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారత్ ఉందని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ పేర్కొన్నారు. 2026 నాటికి ప్రపంచ వాస్తవ జీడీపీ వృద్ధిలో భారతదేశం 17 శాతం వాటాను కలిగి ఉండబోతోందని ఐఎంఎఫ్ గణాంకాలు సూచిస్తున్నాయని ఆయన అన్నారు. సురినామ్ పర్యటనలో భాగంగా స్థానిక సురినామీ సమాజంలోని వివిధ వర్గాల ప్రతినిధులను ఉద్దేశించి కేంద్రమంత్రి ఈరోజు ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రపంచ ఆర్థిక స్థిరత్వానికి భారతదేశం ఒక మూలస్తంభంగా అభివర్ణించారు. భారతదేశ పారిశ్రామిక ఆర్థిక పురోగతి ప్రపంచ స్థిరత్వానికి ఒక సాధనంగా నిలుస్తోందని జై శంకర్ పేర్కొంటూ...

(వాయిస్ 29 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశ వ్యాప్తంగా గృహ వినియోగదారులకు ఎల్పీజీ సరఫరా సజావుగా సాగుతోందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. న్యూఢిల్లీలో ఈ రోజు జరిగిన అంతర్-మంత్రిత్వ శాఖల సమావేశంలో పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి సుజాత శర్మ మాట్లాడుతూ... పశ్చిమాసియాలో మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో గృహ వినియోగదారులు గ్యాస్ కొరతను లేకుండా చూడటమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. గత రెండు రోజుల్లో సుమారు 87 లక్షల ఎల్పీజీ బుకింగ్‌లకు గాను, దాదాపు 57 లక్షల ఎల్పీజీ సిలిండర్లను గృహాలకు పంపిణీ చేసినట్లు ఆమె పేర్కొన్నారు. అలాగే.. గత రెండు రోజుల్లో లక్షా 11 వేలకు పైగా 5 కేజీల సిలిండర్లు అమ్ముడయ్యాయని సుజాత శర్మ తెలిపారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమ బెంగాల్ కు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు సువేందు అధికారి భారతీయ జనతాపార్టీ శాసనసభ పక్ష నేతగా ఎన్నికయ్యారు. కోల్ కతాలో ఈరోజు నిర్వహించిన బీజేపీ శాసన సభా పక్ష సమావేశంలో ఆయనను ఎమ్మెల్యేలు శాసనసభ పక్ష నాయకుడిగా ఎన్నుకున్నారు. ఆ పార్టీ సీనియర్ నాయకుడు, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరై సీనియర్ పార్టీ నాయకుల సమక్షంలో ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. సువేందు అధికారి నాయకత్వంలో కొత్త ప్రభుత్వం రేపు ఉదయం కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో ప్రమాణం చేయనుంది. ఈ  కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు హాజరు కానున్నారు. ఇదిలా ఉండగా పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ అసాధారణ విజయం సాధించిందని అమిత్ షా శాసన సభాపక్ష సమావేశంలో పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

క్షేత్రస్థాయి ఆరోగ్య సంరక్షణను బలోపేతం చేయడానికి ప్రాథమిక ఆరోగ్య బృందాలకు అందించే సమగ్ర శిక్షణా కార్యక్రమాలను కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జె.పి. నడ్డా ఢిల్లీలో ఈరోజు ప్రారంభించారు. దేశంలో క్షేత్రస్థాయిలో పనిచేసే ఆరోగ్య సిబ్బందికి నైపుణ్యంతో కూడిన శిక్షణను దీని ద్వారా అందిస్తారు. ప్రాథమిక ఆరోగ్య బృందాలకు శిక్షణ ఇవ్వడం ద్వారా నైపుణ్య ఆధారిత వ్యవస్థ రూపకల్పనకు కృషి చేస్తున్నట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఇటీవలి సంవత్సరాలలో కేంద్ర ప్రభుత్వం సమగ్ర ప్రాథమిక ఆరోగ్య సంరక్షణతో పాటు సమాజ భాగస్వామ్యంపైన పూర్తిగా దృష్టి సారించింది. ప్రజలు నివసించే ప్రదేశాలకు సమీపంలోనే ఆరోగ్య సంరక్షణకు సంబంధించిన వ్యవస్థ అందుబాటులో ఉండాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందని ఆ శాఖ పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భూ సంబంధిత సేవలను పారదర్శకంగా సమర్థవంతంగా నిర్వహించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కోరారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆధునీకరించే ప్రయత్నాల ద్వారా ప్రజలకు రెవెన్యూ అధికారులకు సౌకర్యాన్ని కల్పించాలని సూచించారు. న్యూఢిల్లీలో ఈ రోజు నిర్వహించిన భూ వనరుల శాఖ సమీక్షా సమావేశానికి కేంద్రమంత్రి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన డిజిటల్ ఇండియా భూ రికార్డుల ఆధునీకరణ కార్యక్రమం 3.0 స్థితిని సమీక్షించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అక్రమ వలసలు మానవ అక్రమ రవాణా సామాజిక భద్రతలోని లోపాలు వంటి సవాళ్లను పరిష్కరించడమే భారతదేశ విధానమని విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ అన్నారు. న్యూయార్క్‌లోని ఐక్యరాజ్య సమితిలో భారత శాశ్వత మిషన్‌లో ఈరోజు జరిగిన 2వ అంతర్జాతీయ వలస సమీక్షా సమావేశంలో ప్రతినిధి బృందాల అధిపతులను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ.. బలమైన అంతర్జాతీయ సహకారం ద్వారా భారతదేశం వలసలను ఎదుర్కొంటోందని అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఐపీఎల్-2026లో భాగంగా ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా కోల్‌కతా నైట్ రైడర్స్, ఢిల్లీ క్యాపిటల్స్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచిన కోల్‌కతా తొలుత ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ 11 ఓవర్లు పూర్తయ్యే సరికి 5 వికెట్ల నష్టానికి 89 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశ భద్రత సరిహద్దులకు మాత్రమే పరిమితం కాదని.. దేశంలోని మొత్తం ప్రజల భద్రతతో ముడిపడి ఉందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. తిరంగా పర్వత రెస్క్యూ (TMR) పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన ఒక కార్యక్రమంలో భారత సైన్యంతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... భారత సైన్యం సరిహద్దులని సురక్షితంగా ఉంచడంతో పాటు విపత్తుల సమయంలో ప్రతి ప్రాణానికి రక్షణ కల్పిస్తోందని గుర్తు చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = =